క్లుప్తంగా

రేపు సి.రామాపురంలో ఉచిత వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తిరుపతి రూరల్ మండలం సి.రామాపురంలోని శ్రీ సిద్ధేశ్వర తీర్థ శ్రీబ్రహ్మర్షి ఆశ్రమంలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రెడ్డెప్ప తెలిపారు. స్విమ్స్, ఎస్వీ అరవింద కంటి వైద్యశాల, ఎస్వీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, మోహన్ డయాబెటిక్స్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు ఆశ్రమం వద్ద టోకెన్లు తీసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మసీదుల వద్ద పటిష్ట భద్రత


ప్రార్థనా స్థలాల వద్ద పహారా కాస్తున్న పోలీసులు

తిరుపతి క్రైం: బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరంలోని ప్రార్థనా స్థలాలు, మసీదుల వద్ద గురువారం పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేలా పోలీసులు పహారా కాశారు.

వీనులవిందు చేసిన నాగలక్ష్మి గానం



తిరుపతి కల్చరల్: స్వాతి తిరునక్షత్రోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో ఎ.నాగలక్ష్మీ బృందం ఆలపించిన సంకీర్తనా గానామృతం ప్రేక్షకులకు వీనుల విందు చేసింది. వారికి కీబోర్డుపై ఎంకే.జాయ్, తబలాపై జీఎం.బాబురావు శృతి, రిథమ్స్‌పై ఆర్.సంగీత వాయిద్య సహకారం అందించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ హనుమంత్‌నాయక్

తిరుపతి మంగళం: ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంత్‌నాయక్ తెలిపారు. ఆయన గురువారం యూడీఎస్, మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. వారి ఆదేశాల మేరకు స్థానిక ప్రజలకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఐసీఎస్.రెడ్డి, గంగులమ్మ, లలితమ్మ, గంగరమణమ్మ, రామచంద్రయ్య, చిట్టెమ్మ, సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీ నటి రాధిక, నటుడు నిఖిల్


ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

తిరుమల: శ్రీవారిని గురువారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తమిళనాడు ఎంపీ అన్బుమణి రామదాసు, పుదుచ్చేరి విప్ ఏకేడీ అర్ముగం, పుదుచ్చేరి మాజీ సీఎం వైద్యలింగం, తెలంగాణ ఎమ్మెల్యే ఉత్తం కుమార్ రెడ్డి, సినీ నటుడు నిఖిల్, సినీనటి రాధిక, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సచివాలయాలతో సులభంగా పనులు

- ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు
- వ్యయప్రయాసలకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పాకాల సచివాలయం నూతన భవనం

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఇంటి వద్దకే 540 రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగేందుకయ్యే వ్యయప్రయాసలకు చెక్ పడింది. సచివాలయాలకు అనుబంధంగా నియమితులైన గ్రామ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది పని తీరు భేష్

పాకాల మండలంలో 22 పంచాయతీలు ఉండగా 19 సచివాలయాలను ఏర్పాటుచేశారు. వాటిలో 114 మంది ఉద్యోగులను నియమించారు. మండలంలోని మొత్తం ఇళ్ల సంఖ్య 18,267 ఉండగా 56,667 మంది జనాభా ఉన్నారు. సచివాలయాలకు అనుబంధంగా రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజలకు వైద్యం అందించేందుకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, అగ్రి క్లినిక్‌లు, పశువులకు వైద్య సేవల కోసం సిబ్బందిని ఏర్పాటుచేశారు. సచివాలయాలతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరం అందుతున్నాయి. కులం, ఆదాయం, నివాసం, జనన, మరణ, భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేస్తున్నారు.

వలంటీర్ల పాత్ర ప్రత్యేకం

సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా ప్రతి 50 కుటుంబాల వారికి సేవలు అందించేందుకు వలంటీర్లను నియమించారు. వీరు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అర్హులైన వారికి పథకాలు అందేలా కీలక పాత్ర పోషిస్తున్నారు.

సచివాలయంలోనే అన్ని పనులు



గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది, ఇప్పుడు పంచాయతీలో ఉన్న సచివాలయంలోనే అన్నీ తీసుకుంటున్నాం. ఏది కావాలన్నా వలంటీర్లు దగ్గరుండి చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి మంచి పని చేసింది.

–పి.వెంకటేశ్వర్‌రావు, మణిపిరెడ్డిపల్లి, పాకాల మండలం

పనులు సులభంగా అవుతున్నాయి



సచివాలయంలోనే అన్ని శాఖల సేవలు అందుతున్నాయి. ముందుగా ఫలానా సమస్య ఉందని సచివాలయంలో తెలపగానే సంబంధిత సచివాలయ ఉద్యోగులు పెడుతున్నారు. ఇబ్బంది పడకుండా సులబతరంగా పనలు జరుగుతున్నాయి. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాము.

–ఎం.శ్రీనివాసులు, అగ్రహారం, పాకాల మండలం

అర్హతే ప్రామాణికం



అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారు. ప్రభుత్వం ఏయే పథకాలు అమలుచేస్తోంది, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, పథకం అందకపోవడానికి గల కారణాలు తదితర వివరాలను సచివాలయంలోని నోటీస్ బోర్డుల్లో పెడుతున్నారు. పనులు కూడా సులభంగా జరుగుతున్నాయి.

–ఆంజనేయులు, తలారిపల్లి, పాకాల మండలం

ఘనంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

తిరుపతి రూరల్ : వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో రిత్యా కన్‌స్ట్రక్షన్ అధినేత నంగా భానుకుమార్‌రెడ్డి, ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నంగా భానుకుమార్‌రెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి


అన్నదానం చేస్తున్న నాయకులు

పాకాలలో అన్నదానం

పాకాల: వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. తండ్రికి తగ్గ తనయుడిగా మోహిత్‌రెడ్డి అన్ని సమయాల్లో ప్రజలకు అండగా ఉంటూ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. అనంతరం చికెన్ బిర్యాని, స్వీట్స్ పంపిణీ చేశారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అన్నదానం చేశారు. డివిజన్ అధ్యక్షుడు బాబు యాదవ్, తాతిరెడ్డి వెంకటరెడ్డి, చిట్టిబాబు, భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్ర యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


'జగనన్న సురక్ష' అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: అర్హులకు ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె గురువారం జగనన్న సురక్షపై సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీర్లు ఇంటింటా చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కార్యక్రమం విధి విధానాలు, ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు స్థానికంగా, వేగంగా ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా అందించే ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ఏవైనా సాంకేతిక కారణాలు ఉంటే వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జూలై ఒకటి నుంచి క్లస్టర్ల వారీగా జగనన్న సురక్ష పథకాన్ని అమలుచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆమె 30, 31వ డివిజన్లతో పాటు బొమ్మగుంటలోని కొన్ని ఇళ్ల వద్దకు వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ సీ.కె.రేవతి, నాయకులు సీ.కె.రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గోవిందరాజ స్వామికి జ్యేష్ఠాభిషేకం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి జూలై 2వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారి ఉత్సవమూర్తులకు ఏడాదికోసారి స్వర్ణ కవచాలను తొలగించి శుద్ధి చేసి తిరిగి అమర్చుతారు. ఇందులో భాగంగా శుక్రవారం కవచాధివాసం, జూలై 1వ తేదీన కవచ ప్రతిష్ఠ, 2వ తేదీన కవచ సమర్పణ నిర్వహిస్తారు. ఈ మూడు రోజులు ఉదయం ఆలయంలో మహా శాంతి హోమం, పుణ్యాహ వచనం చేపడతారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శతకలశ స్నపనం, సాయంత్రం వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఆషాడ మాసం జ్యేష్ఠా నక్షత్రం రోజున ఆలయంలో జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. తిరుపతి కార్పొరేషన్‌తో పాటు జిల్లా పరిధిలోని 39 మండలాలకు జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించింది. వీరు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తిరుపతి నియోజకవర్గం:

సీ1 వార్డులు: 1 - 11 వరకు: దొడ్డారెడ్డి మురళిరెడ్డి
సీ2 వార్డులు: 12 - 29 వరకు: ఉదయగిరి రమేష్
సీ3 వార్డులు: 9, సీ25 - 38 వరకు: మద్దాలి శేఖర్
సీ4– వార్డులు: 39 - 50 వరకు: బాలిశెట్టి కిషోర్

చంద్రగిరి నియోజక వర్గం

చంద్రగిరి: మనోహర్‌రెడ్డి
చిన్నగొట్టిగల్లు: షేక్ ఖదీర్ భాష
పాకాల: విక్రమ్ రెడ్డి
రామచంద్రాపురం: పి.రమేష్ రెడ్డి
తిరుపతి రూరల్: శ్రీరాములు
ఎర్రావారిపాళెం: ఊటుకూరు చెంగల్‌రెడ్డి

అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ నేతల విమర్శలు

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నదమ్ములుగా కలిసి జీవించే మాల, మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టింది చంద్రబాబేనని ఆరోపించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ బిల్లు ఆమోదం సమావేశానికి చంద్రబాబు డుమ్మా కొట్టి వారి పట్ల తనకున్న వివక్షను నిరూపించుకున్నారని తెలిపారు. దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని అవహేళన చేసిన విషయం ఎవరూ మరిచిపోలేదని వెల్లడించారు. ఇప్పుడు సరికొత్త కుట్రలకు తెరలేపుతూ మాల, మాదిగల ఆత్మీయ సదస్సులు చేపడుతున్నారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి పథంలో నడుస్తున్న దళితులు టీడీపీ మోసపూరిత మాటలు వినే పరిస్థితి లేదన్న విషయం గుర్తించాలని తెలిపారు. టీడీపీ కుటిల రాజకీయంలో భాగంగా మాజీ స్పీకర్ ప్రతిభాభారతి సీఎం జగన్‌పై విమర్శలు చేయడం దుర్మార్గమని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: శ్రీనివాస చతుర్వేద హవనంలో భాగంగా తొలి రోజు గురువారం సాయంత్రం టీటీడీ పరిపాలన భవనంలోని మైదానంలో సాంస్కృతిక వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆకట్టుకున్నాయి. ముందుగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు రుత్వికుల చతుర్వేద మంత్ర పారాయణం చేపట్టారు. 6 నుంచి 6.30 గంటల వరకు వైఎల్.శ్రీనివాసులు, బి.కేశన్న బృందం నాదస్వరం, డోలు వాయిద్య సంగీతం అలరించింది. డాక్టర్ ఎ.శబరిగిరీష్ బృందం ప్రదర్శించిన భజనామృతం రంజింపజేసింది. ఆచార్య చిర్రావూరి శ్రీరామశర్మ చతుర్వేద హవనం -కార్యసిద్ధ అనే అంశంపై ప్రవచనం ఆద్యంతం ఆధ్యాత్మికతను రేకెత్తించింది. చివరిగా పి.రవిసుబ్రమణ్యం బృందం ప్రదర్శించిన రామాయణ నృత్య రూపకం రమణీయంగా సాగింది.

నేలకొరిగిన భారీ వృక్షం

తిరుమల: తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద ఉన్న భారీ వృక్షం గురువారం రాత్రి నేలకొరిగింది. తిరుమలలో ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో సీఆర్వో కార్యాలయం వెనుక ప్రాంతంలో ఉన్న ఓ భారీ వృక్షం కూలిపోయింది. అక్కడ పెద్దగా భక్తులు లేకపోవడంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. భక్తులు ఎవరైనా చెట్టు కింద ఉన్నారేమో అని టీటీడీ సిబ్బంది సెల్‌ఫోన్ లైట్ వెలుగులో గాలించారు. ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా తిరుమలలోని పలు ప్రాంతాల్లో గాలీవానకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వాటిని టీటీడీ అటవీ శాఖ విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించారు.

శుభాకాంక్షల వెల్లువ


బండ్ల చంద్రశేఖర్‌రాయల్‌కు స్వీట్ తినిపిస్తున్న రుయా సిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన చాంబర్లో కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. నర్సింగ్ సూపరింటెండెంట్ తన సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా కేకును కట్ చేసి బండ్ల చంద్రశేఖర్ కు తినిపించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఏఆర్ ఎంఓ డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదాల పంపిణీ



తిరుపతి గాంధీ రోడ్: మొదటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోని జ్ఞానప్రద వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

డాక్టర్ వెంగమ్మకు స్విమ్స్‌తో వీడనున్న బంధం

తిరుపతి తుడా: టీటీడీ స్విమ్స్ యూనివర్సిటీలో న్యూరాలజీ ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించిన వెంగమ్మ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆమెను డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. వెంగమ్మకు డైరెక్టర్‌గా 2024 ఆగస్టు వరకు అవకాశం ఉంది.

ద్రౌపదిదేవి పురవిహారం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ద్రౌపదీ వస్త్రాపహరణం కార్యక్రమంలో ఉత్సవమూర్తులను చప్పరంపై అధిష్ఠించి ఊరేగించారు.

రూ.2 కోట్లతో షాదీ మహల్ నిర్మాణానికి చర్యలు


ప్రార్థనలు చేస్తున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణానికి చెందిన ముస్లింలకు బక్రీద్ పండుగ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ కానుకను ప్రకటించారు. రూ.2 కోట్లతో షాదీ మహల్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో టెండర్లు పిలిచి రానున్న రంజాన్ నాటికి షాదీ మహల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బక్రీద్ సందర్భంగా గురువారం చంద్రగిరి ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు మత పెద్దలు మోహిత్ రెడ్డిని ఆశీర్వదించారు. షాదీ మహల్ నిర్మాణం చేపట్టాలని ముస్లిం మత పెద్దలు కోరడంతో మోహిత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. మత పెద్దలు జర్ బహర్, కాలేషా, ఎథిన్ షా, నన్నే సాహెబ్, చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మస్తాన్ పాల్గొన్నారు.

రక్తదానం


యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఆర్ యూత్ పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రుయా ఆసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగిమల్లవరం ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ బి.యోగానంద రెడ్డి, ముండ్లపూడి సర్పంచ్ సురేష్‌రెడ్డి, బ్రాహ్మణపట్టు మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న నగర డిప్యూటీమేయర్ భూమన అభినయ్ రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే. బాబు


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్గా మైదానానికి విచ్చేసిన వారిని తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది, మాట్లాడుతున్న మత పెద్ద

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

తిరుపతి నగరంలోని ముస్లింలు గురువారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూ సమీపంలోని ఈద్గా మైదానం వద్దకు ఉదయమే పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు సందర్భంగా దానధర్మాలు చేశారు. ప్రార్థనల్లో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి